క్లుప్తంగా

కుంచమ్మ స్థలాన్ని పరిశీలించిన అధికారులు



స్థలాన్ని పరిశీలిస్తున్న సింహాచలం దేవస్థానం అధికారులు

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు లక్ష్మీనగర్ ఈ బ్లాక్‌లో ప్రభుత్వానికి అప్పగించిన కుంచమ్మ స్థలాన్ని సింహాచలం దేవస్థానం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామలక్ష్మి పరిశీలించారు. సర్వేనంబర్ 1లోని 160 గజాల తన ఇంటి స్థలాన్ని ప్రభుత్వ అవసరాలకు వాడుకోవాలని లావేటి కుంచమ్మ సోమవారం గ్రీవెన్స్‌సెల్‌లో పత్రాలు అందజేసిన విషయం తెలిసిందే. అయితే ఆ స్థలం దేవస్థానం భూముల్లో ఉండడంతో సింహాచలం దేవస్థానం అధికారులు మంగళవారం స్థలాన్ని పరిశీలించారు. మొత్తం స్థలం ఎంత ఉందో కొలతలు తీశారు. కార్యక్రమంలో గోపాలపట్నం ఆర్ఐ సురేష్ కుమార్, సర్వేయర్ జగదీష్, వీఆర్వో సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

18న వాహనాల వేలం

అగనంపూడి: వాహనాల పన్నులు చెల్లించకపోవడంతో గాజువాక ఆర్టీవో కార్యాలయం సీజ్ చేసిన 15 వాహనాలకు ఈ నెల 18న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు గాజువాక ఆర్టీవో జయప్రకాష్ తెలిపారు. వాహనాల పన్ను చెల్లించకుండా రోడ్డు మీద తిరుగుతున్న వాహనాలను ఇటీవల సీజ్ చేయడం చేశామని, సకాలంలో పన్ను చెల్లించి వాటిని తిరిగి తీసుకువెళ్లని కారణంగా ఒక ట్రాక్టర్, రెండు టాటా మ్యాజిక్ వ్యానులు, ఏస్ ట్రక్ ఒకటి, పది మోటార్ సైకిళ్లను వేలం వేస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. వేలంలో పాల్గొనదలచిన వారు 18వ తేదీలోగా రూ.5వేల డిమాండ్ డ్రాఫ్ట్ చెల్లించి కార్యాలయంలో సమర్పించాలని, వివరాలకు అగనంపూడిలోని కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదంలో బిచ్చగాడు మృతి

సింహాచలం : గోపాలపట్నం నుంచి సింహాచలం వెళ్లే ప్రధాన రహదారిలో ప్రహ్లాదపురం వద్ద లారీ ఢీకొని మంగళవారం రాత్రి ఒక బిచ్చగాడు మృతి చెందాడు. అతని వయసు 55 సంవత్సరాలు ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.

సందడిగా గ్రాడ్యుయేషన్ డే



స్నాతకోత్సవంలో చిన్నారులు

సింహాచలం: స్నాతకోత్సవ వేడుకలు విద్యార్థుల్లో నూతన ఉత్సాహాన్ని నింపుతాయని రవీంద్ర భారతి ప్రిన్సిపాల్ ఆర్. స్వరూప చంద్రకళ తెలిపారు. సుజాతనగర్‌లోని రవీంద్రభారతి పాఠశాలలో చిన్నారుల స్నాతకోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రముఖ గైనకాలజిస్టు డాక్టర్ బి.సత్యవతి విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల జోనల్ ఇన్‌చార్జి వెంకటేష్, జీఎం రమ్య పాల్గొన్నారు.

నిర్వహణ లోపం.. తాగునీటికి గండం!



మరమ్మతులకు గురైన కలపాక ఆర్వో ప్లాంటు



మూత పడిన దేశపాత్రునిపాలెం ఆర్వో ప్లాంటు

మూలకు చేరిన ఆర్వో ప్లాంట్లు

పరవాడ: గ్రామీణ ప్రజల దాహార్తి తీర్చడానికి సింహాద్రి ఎన్టీపీసీ లక్షల వ్యయంతో నిర్మించిన ఆర్వో ప్లాంట్లు మరమ్మతులకు గురయ్యాయి. ఫలితంగా శుద్ధి చేసిన మంచి నీటిని అందించాలన్న లక్ష్యంతో నిర్మించిన ఆర్వో ప్లాంట్ల నిర్వహణ లేక అనతికాలంలో మూతపడ్డాయి. దీంతో మండలంలోని కలపాక, దేశపాత్రునిపాలెం గ్రామాల ప్రజలు తాగునీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు. ప్రజలు దప్పిక తీర్చుకునేందుకు మైళ్ల దూరం పరుగులు తీయాల్సి వస్తోంది.

ఇదీ పరిస్థితి

సింహాద్రి ఎన్టీపీసీ నిర్వాసిత గ్రామ ప్రజలకు శుద్ధి చేసిన మంచినీటిని అందించడానికి ఆరేళ్ల కిందట ఆర్వో ప్లాంట్లు నిర్మించింది. కొంత కాలం వరకు సజావుగా పనిచేసిన ఆర్వో ప్లాంట్ల నిర్వహణ లేకపోవడంతో మంచినీరు బాగో లేదన్న కారణంతో స్థానికులు వినియోగించడం మానేశారు. దీంతో ప్లాంటులో యంత్ర పరికరాలు పాడైపోయి మూతపడింది. ప్రస్తుతం ప్రజలు తాగునీటి కోసం మైళ్ల దూరంలో గల వెన్నలపాలెం, పరవాడ ప్రాంతాల్లోని ఆర్వో ప్లాంట్లకు పరుగులు తీస్తున్నారు.

➡ జీవీఎంసీ 79 వార్డులో ఎన్టీపీసీ సౌజన్యంతో రూ.11.60 లక్షల వ్యయంతో 2018లో నిర్మించిన ఆర్వో ప్లాంటు కొంత కాలం పనిచేసింది. భూగర్భ జలాలు అడుగంటడడంతో ప్లాంటు పనిచేయడం లేదు. దీంతో స్థానికులు ప్రైవేటు ఆర్వో ప్లాంట్లను ఆశ్రయిస్తున్నారు. మోటారు కూడా రిపేర్లతో మూలుగుతోంది. మరమ్మతులు చేసి ఆర్వో ప్లాంట్లను వినియోగంలోకి తీసుకు రావాలని స్థానికులు కోరుతున్నారు.

వినియోగంలోకి తెస్తాం

కలపాక ఆర్వో ప్లాంటు మరమ్మతులు త్వరలో చేపడతామని సర్పంచ్ బొండా కనకారావు చెప్పారు. గ్రామంలో కొత్తగా ఏర్పాటు చేసిన రక్షిత మంచినీటి పథకం నుంచి పైపులైన్ ద్వారా ఆర్వో ప్లాంటుకు మంచినీటిని సరఫరా చేసి శుద్ధి చేసిన తర్వాత ప్రజలకు సరఫరా చేయనున్నట్లు సర్పంచ్ కనకారావు చెప్పారు.

ఐదో రోజు.. అదే జోరు



రావాడలో ఓ ఇంటిపై జగనన్న స్టిక్కర్ అతికిస్తున్న పార్టీ నాయకులు



రాంపురంలో మానమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో సర్పంచ్ అన్నంరెడ్డి శిరీష



మా నమ్మకం నువ్వే జగన్ బ్రోచర్ అందజేస్తున్న ముత్యాలనాయుడు తదితరులు

సింహాచలం: జగనన్నే మా భవిష్యత్ – మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నియోజకవర్గంలో ఉత్సాహంగా సాగుతోంది. వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తున్నారు. పాలనపై ప్రజల అభిప్రాయాలు సేకరిస్తున్నారు. సంక్షేమ పాలన కోసం వచ్చే ఎన్నికల్లో కూడా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని మద్దతు కోరుతున్నారు. జగనన్నే మా భవిష్యత్తు...మా నమ్మ కం నువ్వే జగన్ కార్యక్రమాన్ని మంగళవారం పెందుర్తి మండలం రాంపురంలో ఘనంగా నిర్వహించారు. సచివాలయ కన్వీనర్లు అన్నంరెడ్డి శిరీష, అన్నంరెడ్డి శ్రీరాములు ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజా అభిప్రాయాన్ని సేకరించారు.

➡ 93వవార్డు పరిధిలోని శ్రీనివాసనగర్, పోస్టల్ కాలనీలో 93వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు దాసరి సత్తిబాబు జగనన్నే మా భవిష్యత్తు...మాన మ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

➡ 98వ వార్డు అడవివరంలోని ఘాట్‌రోడ్డు ఏరియాలో జగనన్నే మా భవిష్యత్తు..మా నమ్మకం నవ్వే జగన్ కార్యక్రమాన్ని 98వవార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు నిర్వహించారు. కార్యక్రమంలో అడవివరం కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి, నాయకులు పీతల అప్పలరాజు, గుడ్ల గురునాథరెడ్డి, తెడ్లపు మహేష్ పాల్గొన్నారు.

పరవాడ: వెన్నలపాలెంలో సర్పంచ్ వెన్నల అప్పారావు ఆధ్వర్యంలో నాయకులు, కన్వీనర్లు ఇంటింటికీ వెళ్లి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. వెన్నల సింహాద్రి, మాసవరపు ముత్యాలనాయుడు, పాల్గొన్నారు.

➡ వైస్ ఎంపీపీ బంధం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో రావాడ శివారు సోమునాయుడుపాలెంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనరు వెన్నల సన్యాసిరావు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, సిరపరపు చంటి, అక్కుల బాబు పాల్గొన్నారు.

➡ కన్నూరులో సర్పంచ్ గొల్లవిల్లి నాగమణి, ఎంపీటీసీ గొల్లవిల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి సీఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో మండల జేసీఎస్ కన్వీనర్ వి.సన్యాసిరావు, మాజీ సర్పంచ్ పచ్చికూర వెంకటరమణ పాల్గొన్నారు.

రాయపుర అగ్రహారంలో..

సబ్బవరం: మండలంలోని రాయపుర అగ్రహారంలో సర్పంచ్ పిల్లల అప్పలనాయుడు ఆధ్వర్యంలో మంగళవారం మానమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. మండల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పాలన, గత ప్రభుత్వంలో మోసపూరిత విధానాలను ప్రజలకు వివరించారు. వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో రాపేటి రాము,ఉప సర్పంచ్ దుంగ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రామ దేవతల ఉత్సవాలు



పి.బోనంగిలో బోయమాంబను దర్శించుకుంటున్న గ్రామ పెద్దలు

పరవాడ: పెదముషిడివాడ, పి.బోనంగి శివారు వీఎల్ఎస్ పురం గ్రామాల్లో కొలువుదీరిన శ్రీ పైడిమాంబ, బోయమాంబ అమ్మవార్ల పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. పెదముషిడివాడలో అమ్మవారి ఆలయాన్ని రంగు రంగుల విద్యుత్ తోరణాలతో సుందరంగా అలంకరించారు. వేకువ జాము నుంచి అమ్మవారిని దర్శించుకొనేందుకు భక్తులు బారులు తీరారు. గ్రామ సర్పంచ్ పల్లా నాగమణి, ఎంపీటీసీ ఒమ్మి వెంకటరావు, గ్రామ పెద్దలు పల్లా అప్పారావు(కబడ్డి), యలమర్తి బుజ్జి, బలిరెడ్డి అప్పారావు తదితరులు దర్శించుకున్నారు. రాత్రికి గ్రామంలో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. భారీ బాణ సంచాకాల్చుల నడుమ అమ్మవారి అనుపు మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

– పి.బోనంగి శివారు వి.ఎల్.ఎస్ పురంలో బోయమాంబ అమ్మవారిని భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకున్నారు. అమ్మవారిని సర్పంచ్ బండారు కల్పన రాజశేఖర్, మాజీ ఎంపీటీసీ డెక్క శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు బండారు బోయన్న, చిన్నారావు తదితరులు దర్శించుకున్నారు. రాత్రికి బాణ సంచాకాల్చుల మధ్య అమ్మవారి అనుపు మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

బంగారుమాంబ పండగకు ఏర్పాట్లు



గొర్లివానిపాలెంలో వెలసిన బంగారుమాంబ

పరవాడ: మండలంలోని గొర్లివానిపాలెం గ్రామ ప్రజల కొంగు బంగారమైన బంగారుమాంబ పండగను గురువారం ఘనంగా నిర్వహించడానికి ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేసింది. ఆలయ ప్రాంగణంలో భక్తులకు ఇబ్బంది లేకుండా క్యూలైన్లు ఏర్పాటు చేశారు. తాగునీరు, మజ్జిగ, ప్రసాదాలు పంపిణీ చేయనున్నారు. పండగ రోజు రాత్రి 8 గంటల నుంచి స్టార్‌నైట్, డ్యాన్స్ హంగామా వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నామని సర్పంచ్ గొర్లి గోపి అమ్మలు చెప్పారు.

వైభవంగా నాగపైడితల్లమ్మ పండగ



భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న కార్పొరేటర్ వసంత దంపతులు

సింహాచలం: జీవీఎంసీ 97వ వార్డు పరిధి ఆంజనేయనగర్ కాలనీలో కొలువుదీరిన నాగ పైడి తల్లమ్మవారి పండగ మంగళవారం ఘనంగా జరిగింది. భక్తులు పసుపుకుంకుమలు సమర్పించి అమ్మవారి మొక్కులు చెల్లించారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్న సమారాధనను కార్పొరేటర్ శానాపతి వసంత ప్రారంభించారు. భక్తులకు అన్న ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు శానాపతి శంకరరావు, అప్పారావు, సన్ని, అర్జున, సోమేష్, శ్రీను పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్య స్వామికి విశేషంగా అభిషేకాలు



సింహాచలం: విజినిగిరిపాలెంలోని ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో కొలువైన వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి మంగళవారం అభిషేకాలు, పూజలు విశేషంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ పూజలు నిర్వహించారు.

చల్లగచూడు పరదేశమ్మా..

సబ్బవరం: మండలంలోని సబ్బవరం శివారు ఆదిరెడ్డిపాలెంలో పరదేశిమాంబ పండగను మంగళవారం వైభవంగా నిర్వహించారు. మహిళలు పసుపు కుంకుమలు,చీరలు అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి అమ్మవారి అనుపు మహోత్సవం కనుల పండువగా జరిగింది. అమ్మవారిని దర్శించుకున్నవారిలో వైఎస్సార్‌సీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు కొటాన రాము, ఎంపీటీసీ బైలపూడి దేముడుబాబ్జి, రమణ ఉన్నారు.

గొప్ప సంఘ సంస్కర్త పూలే



అడవివరం జెడ్పీ హైస్కూల్‌లో పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



పరవాడలో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీసీ సంక్షేమ సంఘ ప్రతినిధులు



సబ్బవరం కేజీబీవీలో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్‌వో మృదుల



పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

విశాఖ విద్య: మహాత్మా జ్యోతిరావు పూలే సేవలు ఆదర్శనీయమని పలువురు వక్తలు కొనియాడారు. పూలే జయంతి పురస్కరించుకొని మంగళవారం విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో వేడుకలు నిర్వహించారు. పూలే చిత్రపటానికి పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పూలమాల లు వేసి ఘనంగా నివాళులర్పించారు. సామాజిక న్యాయం కోసం మహాత్మా జ్యోతిరావు పూలే చేసిన సేవలను విద్యార్థులకు వివరించారు. చినగదిలి మండలం అడవివరం జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఇమంది పైడిరాజు విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలసి పూలే విగ్రహానికి పూలమాలలు వేశారు. ఆయన చూపిన మార్గంలో విద్యార్థులంతా పయనించాలని పిలుపునిచ్చారు.

పరవాడ: పరవాడలో బీసీ సంఘ ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు బంధం పైడిరాజు జ్యోతిరావుపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘననివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు తోనంగి వెంకటరమణి, చింతకాయల కొర్లయ్య, కూండ్రపు ఉమామహేశ్వరి, సిరపరపు సత్య, సుబ్బలక్ష్మి, గెడ్డం బాబూరావు పాల్గొన్నారు.

➡ సీఐటీయూ ఆధ్వర్యంలో పూలే జయంతిని పరవాడలో ఘనంగా నిర్వహించారు. జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సుందరపు శ్రీనివాసరావు, బి.సూరప్పారావు, ఎస్.కృష్ణ అప్పారావు, ఎం.శ్రీను, పి.రాంబాబు పాల్గొన్నారు.

అణగారిన వర్గాల ఆశాజ్యోతి

సింహాచలం: అణగారిన వర్గాల అభివృద్ధి కోసం కృషి చేసిన గొప్పన సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే అని 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు అన్నారు. 95వ వార్డు పరిధి కృష్ణరాయపురంలో మంగళవారం పూలే చిత్రపటానికి ఆయన పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ భారత తొలి సామాజిక ఉద్యమ పితామహుడు జ్యోతిరావు పూలే అని కొనియాడారు. కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు అంగటి సూరిబాబు, పెంటయ్య, శ్రీను, నాయుడు, అప్పారావు, శివ, గంగరాజు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

సబ్బవరం: సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహోన్నత వ్యక్తి మహాత్మా జ్యోతిరావు పూలే అని కేజీబీవీ ఎస్‌వో మృదుల కొనియాడారు. స్థానిక కేజీబీవీలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

భక్తిశ్రద్ధలతో లక్ష్మీనారాయణ వ్రతాలు



లక్ష్మీనారాయణస్వామి వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

సింహాచలం: సింహగిరిపై మంగళవారం లక్ష్మీనారాయణ వ్రతాలు ఘనంగా జరిగాయి. ఆలయ ప్రాంగణంలోని మండపంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జరిగిన వ్రతాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బీసీ గురుకులంలో పూలే విగ్రహావిష్కరణ



జ్యోతిరావుపూలే విగ్రహావిష్కరణలో పాల్గొన్న ప్రిన్సిపాల్ సత్యారావు, విద్యార్థులు

సింహాచలం: మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకుని మంగళవారం సింహాచలంలోని మహాత్మా జ్యోతిబాపూలే ఏపీ బీసీ గురుకుల పాఠశాల, కళాశాలలో పూలే విగ్రహావిష్కరణను ఘనంగా నిర్వహించారు. విశాఖ ప్రధాన స్పోర్ట్స్ ప్రొప్రైటర్ అన్నాబత్తుల భాగ్యశేఖర్ ఆర్థిక సాయంతో పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన జ్యోతిరావుపూలే విగ్రహాన్ని ఈపీడీసీఎల్ రిటైర్డ్ ఈఈ పీఆర్‌కే మనోహర్ ఆవిష్కరించారు. పాఠశాల ప్రిన్సిపాల్ సత్యారావు పూలే విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ స్కూల్స్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రవిసిద్ధార్థ, కళాశాల, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.